సాక్షి అనంతపురం

సోమవారం । 5 । మే । 2025



కుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి

బుక్కరాయసముద్రం మండలం అమ్మవారిపేటలో 85 గొర్రెపిల్లలు కుక్కలదాడిలో చనిపోయాయి. 8లో



'పచ్చ' కుట్రలు తిప్పికొట్టాలి

అవాస్తవాలతో సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్న 'పచ్చ' మీడియా కుట్రలను తిప్పికొట్టాలని ఆలూరు పిలుపునిచ్చారు. 8లో

గరిష్టం/కనిష్టం
41.1°/24.6°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బుక్కరాయసముద్రంలో నేడు పరిష్కార వేదిక

అనంతపురం అర్బన్: బుక్కరాయసముద్రంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. చెరువుకట్ట సమీపంలోని శ్రీసాయి బాబా కల్యాణమండపంలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలన్నారు. వాటిని అధికారులు పరిశీలించి గడువులోపు పరిష్కారం చూపుతారని తెలిపారు.

భగీరథ మహర్షి జీవితం ఆదర్శప్రాయం



భగీరథునికి నివాళులర్పిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం రూరల్: భగీరథ మహర్షి జీవితం ఆదర్శ ప్రాయమని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న భగీరథ మహర్షి విగ్రహానికి ఎంపీ, కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగీరథ మహర్షి జీవితం నేటి తరానికి ఆదర్శ ప్రాయమన్నారు. తన కఠోర తపస్సుతో గంగను భూమి మీదకు తీసుకొచ్చిన మహానుభావుడు భగీరథుడని కొనియాడారు. సాధించాలన్న పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమేనన్నారు. భగీరథ మహర్షి స్ఫూర్తితో జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఖుష్బూకొఠారి, బీసీ సంక్షేమశాఖ హాస్టల్ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, జిల్లా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, సగర సంక్షేమ సంఘం నాయకులు సగర పవన్‌కుమార్, బీసీ సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

16న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి చర్చను ప్రారంభిస్తారన్నారు. గత సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలకు సంబంధించి సమగ్ర వివరాలతో అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలతో పాటు అన్ని శాఖల అధికారులకు సమాచారం చేరవేసినట్లు తెలిపారు. అధికారులు గైర్హాజరు కావొద్దని స్పష్టం చేశారు. ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లా అధికారులు కచ్చితంగా హాజరు కావాలని సూచించారు.

అక్రమ కేసులు సరికాదు

- పోలీసుల వైఫల్యంతోనే 'హెలిప్యాడ్' ఘటన
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా పోలీసుల ద్వారా అక్రమ కేసులు బనాయిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన తన నివాసంలో 'సాక్షి'తో మాట్లాడారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో పోలీసుల భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపించిందన్నారు. హెలిప్యాడ్ వద్ద జనాలను నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశారన్నారు. రోజూ ఎవరో ఒకరి మీద పనిగట్టుకుని పోలీసులు కేసు నమోదు చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని కేసులు నమోదు చేసినా.. భయపడే ప్రసక్తే లేదన్నారు. రెట్టింపు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తామన్నారు. పార్టీ అండగా ఉంటుందని, ఎవ్వరూ భయపడవద్దని అన్నారు.

సంపాదన కోసం 'పచ్చ' నేతలు అడ్డదారులు తొక్కారు. పెద్దకొండపై పాగా వేసి సహజ వనరుల లూటీకి తెగబడ్డారు. అధికారంలో ఉన్నాం.. అందినంత దోచుకుందాం అనే రీతిలో పేట్రేగిపోతున్నారు. పెద్దకొండను ఇష్టానుసారం తవ్వేస్తూ అనకొండలుగా మారారు. కొంతకాలానికి కొండ ఆనవాళ్లు లేకుండా పోయినా ఆశ్చర్యపోనవసరం లేదు.

'పెద్దకొండ'లో పచ్చ అనకొండలు





- ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు
- కృష్ణమరెడ్డిపల్లికి చెందిన ఇద్దరు టీడీపీ నేతల బరితెగింపు
- రోజూ 90 ట్రిప్పుల దాకా ఎర్రమట్టి తరలింపు
- ఉత్తరం వైపు అడ్డుకుంటే దక్షిణం వైపు నుంచి తవ్వకాలు మరూ
- పోలీసులు, ఆర్టీఏ, భూగర్భ గనుల శాఖ విజిలెన్స్ అధికారులకు నెలవారీ మామూళ్లు!
- ముఖ్య ప్రజాప్రతినిధి పేరు చెప్పుకుంటూ నిరాటంకంగా సహజ వనరుల దోపిడీ



కొండను తవ్వుతూ టిప్పర్‌కు మట్టిని లోడ్ చేస్తున్న హిటాచీ వాహనం



ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్లు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కృష్ణమరెడ్డిపల్లి సమీపంలోని 231 సర్వే నంబరు (చియ్యేడు పొలం)లో పెద్దకొండ కరిగిపోతోంది. కృష్ణమరెడ్డిపల్లికి చెందిన ఇద్దరు తెలుగు తమ్ముళ్లే కొండను కరిగించేస్తున్నారు. 'అధికారం మాదే...మమ్మల్ని ఆపేదెవరు?' అంటూ రెచ్చిపోతున్నారు. ఈ కొండ ఎక్కడో మారుమూల ప్రాంతంలో లేదు. అనంతపురం–కదిరి జాతీయ రహదారికి ఎడమ వైపు కూతవేటు దూరంలో ఉంది. అనుమతులు లేకపోయినా బరి తెగించి ఈ కొండ నుంచి సహజ వనరులను కొల్లగొడుతున్నారు. మొన్నటిదాకా కొండకు ఉత్తరం వైపు (కృష్ణమరెడ్డిపల్లి) మట్టిని తవ్వేసిన 'తమ్ముళ్లు'.. అక్కడి లీజుదారులు అభ్యంతరం తెలపడంతో వారం రోజులుగా దక్షిణం వైపు (చియ్యేడు) నుంచి తవ్వుతూ వస్తున్నారు.

ఇద్దరూ ఇద్దరే...

కృష్ణమరెడ్డిపల్లికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు కలసికట్టుగా దోపిడీకి తెర తీశారు. హిటాచీ, జేసీబీల సాయంతో మట్టిని తవ్వుతూ టిప్పర్లలో నింపుతున్నారు. వీరిలో ఒకరికి మూడు టిప్పర్లు ఉన్నాయి. ఇద్దరికీ కలిసి ఒక హిటాచీ వాహనం ఉంది. వీరి టిప్పర్లే కాకుండా బయట వారికి కూడా లోడింగ్ చేస్తున్నారు. బయటి వాహనాలకు ఒకసారి లోడింగ్ చేసినందుకు రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. వారి సొంత వాహనాల ద్వారా నిత్యం నగరానికి మట్టి తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పు మట్టి రూ.6–7 వేల దాకా అమ్ముతున్నారు. రోజూ 90 ట్రిప్పుల దాకా మట్టి తరలిస్తున్నారు. ఖర్చులన్నీ పోను రోజూ రూ.2 లక్షలకు పైగా ఆదాయం పొందుతున్నారు. గతంలో ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్న ఈ ఇద్దరు నాయకులు ఇటీవలి కాలంలో 'పెద్దకొండ' పుణ్యమా అని రూ.కోట్లకు పడగలెత్తారు.

అందరికీ నెలవారీ మామూళ్లు..

వీరి అక్రమ దందాకు కొందరు అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. పోలీసులు, ఆర్టీఏ, భూగర్భ గనుల శాఖలోని విజిలెన్స్ అధికారులకు నెలవారీ మామూళ్లు ఇస్తున్నట్లు ఆ ప్రాంతంలో జోరుగా చర్చ జరుగుతోంది. ఈ కారణంగానే అక్రమ రవాణా విషయంలో ఆయా శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. నెలల తరబడి వీరి దందా సాగుతున్నా అధికారులు ఇప్పటిదాకా చర్యలు తీసుకోకపోవడం అనుమానాలను బలపరుస్తోంది. దీనికితోడు పొరపాటున ఎవరైనా వీరి వాహనాలను ఆపితే వెంటనే కొందరితో ఫోన్లు చేయిస్తున్నారు. తరచూ రాప్తాడు నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి పేరు చెబుతూ 'మట్టి దందా'ను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

ఉచిత గ్యాస్ ఊసేదీ?

- ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామన్న ప్రభుత్వం
- గత అక్టోబరు నుంచి ఈ మార్చి వరకు ఒకదానితోనే సరి
- అదీ 5 లక్షల మంది లబ్ధిదారుల్లో 4 లక్షల మందికే
- ఈ ఏడాది మే నెల వచ్చినా ఉచిత గ్యాస్ ఊసెత్తని ప్రభుత్వం



ఈ ఏడాది ఎప్పుడిస్తారో..?

అనంతపుర అర్బన్: ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. గత ఏడాది అక్టోబర్‌లో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించింది. గత మార్చి వరకు ఒక సిలిండర్ మాత్రమే ఉచితంగా వర్తింపజేశారు. అయితే అది కూడా చాలామందికి అందలేదు. అధికారిక నివేదిక ప్రకారం ఉచిత సిలిండర్ పొందేందుకు జిల్లాలో 5.05 లక్షల మంది అర్హులు ఉండగా 4.03 లక్షల మంది మాత్రమే లబ్ధి పొందారు. అర్హులుగా ఉన్నప్పటికీ 1,02,361 మందికి వివిధ కారణాలతో ఉచిత సిలిండర్ అందలేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఇవ్వాల్సి ఉంది. ఏప్రిల్ నుంచి జూలై మధ్య మొదటి సిలిండర్, ఆగస్టు నుంచి నవంబరు మధ్య రెండవ సిలిండర్, ఇక డిసెంబరు నుంచి మార్చి మధ్య మూడవ సిలిండర్ ఇవ్వాల్సి ఉంది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఒక నెల గడిచిపోయింది. మే నెల ప్రారంభమైనా కూడా ప్రస్తుత ఏడాదికి సంబంధించి మొదటి సిలిండర్ పంపిణీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. దీంతో ఉచిత సిలిండర్ ఎప్పుడిస్తారా.. అని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు	
మొత్తం కనెక్షన్లు	7,65,246
దీపం	2,14,970
పీఎంయూవై	30,355
సీఎస్ఆర్	37,257
సాధారణ	4,82,664

ఉచిత పథకానికి అర్హులు : 5,05,831

ఒక సిలిండర్ అందుకున్నవారు : 4,03,470

అర్హత ఉండి లబ్ధిపొందనివారు : 1,02,361

ఈ ఆర్థిక సంవత్సరంలో : ఇంకా వర్తించలేదు

ఎప్పుడిస్తారో చెప్పలేదు



ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. మాకు గత ఏడాది ఒకసారి ఇచ్చారు. ఈ సంవత్సరం మొదటి సిలిండర్ ఎప్పుడు ఇస్తారో ఇప్పటికీ చెప్పలేదు. అడిగితే ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదని చెబుతున్నారు.

– శివమ్మ, పాలచెర్ల, రాప్తాడు మండలం

ఉచిత గ్యాస్ గురించి చెప్పేవారేరీ?



గత ఏడాది ఒక సిలిండర్‌కు రిటర్న్ డబ్బులు వేశారు. సంవత్సరానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పారు. అయితే ఈ ఏడాదికి ఇంకా ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారని అడిగితే మాకు తెలీదు. ప్రభుత్వం ప్రకటిస్తే మీరు కట్టిన డబ్బులు బ్యాంకులో పడతాయని చెబుతున్నారు.

– కాంతమ్మ, బండమీదపల్లి, రాప్తాడు మండలం

● చీరల పందిరి



మడుగుపల్లి వద్ద దానిమ్మ తోటపై కప్పిన చీరలు

పుట్లూరు: ఈ వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలతో పాటు పశుపక్ష్యాదులు అల్లాడిపోతున్నాయి. పంటలపైనా ఎండల ప్రభావం అధికంగా ఉంటోంది. పూత, పిందె మగ్గిపోవడం, కాయలు నల్లగా మారడం, ఎక్కువ నీరు అందించినా పంటలు వాడిపోవడం కనిపిస్తోంది. దీంతో పలువురు రైతులు వినూత్నంగా ఆలోచించి నష్ట నివారణ చర్యలు తీసుకుంటున్నారు. పుట్లూరు మండలం మడుగుపల్లి బయన్నస్వామి ఆలయ సమీపంలో నార్పలకు వెళ్లే రోడ్డు పక్కన వెంకటరాముడు అనే రైతు తనకున్న 1.5 ఎకరాల దానిమ్మ తోటకు చీరలతో పందిరి వేసి ఎండల నుంచి రక్షణ కల్పిస్తున్నాడు. ఈ దృశ్యం అటుగా వెళ్తున్న వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ప్రశాంతంగా 'నీట్'



అనంతపురం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల హడావుడి



విద్యార్థుల హాల్ టికెట్ చూసి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న అధికారులు

అనంతపురం: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్–యూజీ 2025) ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రాలు (అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాయ్స్), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్కేయూ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, జేఎన్టీయూ–ఏ ఇంజినీరింగ్ కళాశాల, కేఎస్ఎన్ ప్రభుత్వ ఉమెన్స్ కళాశాల, ఏపీ మోడల్ జూనియర్ కళాశాల– గుత్తి) ఏర్పాటు చేశారు. 2,613 మందికి గాను, 2,534 మంది (96.97 శాతం) హాజరయ్యారు. 79 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి కనిపించింది. బాగా రాయాలంటూ తల్లిదండ్రులు తమ పిల్లలకు చెప్పి లోనికి పంపించారు.

తల్లిదండ్రులకు తప్పని ఇక్కట్లు..

నీట్ రాయడానికి అభ్యర్థులతో పాటు వచ్చిన తల్లిదండ్రులకు ఇక్కట్లు తప్పలేదు. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రం ఎస్కేయూ ప్రధాన ద్వారానికి చాలా దూరంగా ఉంటుంది. తల్లిదండ్రులు అందరినీ ప్రధాన ద్వారం వద్దే ఆపేశారు. ఇంజినీరింగ్ కళాశాల పరిసరాల్లోకి రాకుండా ఆపి ఉంటే బాగుండేది. ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్దే ఆపివేయడంతో తల్లిదండ్రులు మండుటెండల్లో రోడ్డుపైనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎస్కేయూ ఉద్యోగుల క్వార్టర్స్‌లో ఉండే ప్రొఫెసర్లు, వారికి మంచినీరు ఇచ్చి దాహం తీర్చారు. అతి పెద్ద క్యాంపస్ అయిన ఎస్కేయూ లోపలికి తల్లిదండ్రులను కూడా అనుమతించి ఉంటే క్యాంటీన్ వద్దో.. ఇతరత్రా భవనాల వద్ద కూర్చుని ఉండేవారు. ఉదయం 11 గంటలకు లోపలికి వెళ్లిన అభ్యర్థులు సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాలేదు. ఈ క్రమంలో తల్లిదండ్రులు బయటే మండుటెండలో వేచి ఉన్నారు. బిడ్డల భవిష్యత్తు కోసం ఎంత కష్టమైనా పడతామనే రీతిలో తల్లిదండ్రులు అక్కడే నిరీక్షించడం గమనార్హం.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

వేర్వేరుగా నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్, నీట్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద డీఎఫ్ఎండీలు, హెచ్ఎస్ఎండీల ద్వారా పరిశీలించి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి పంపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకున్నారు.

- నీట్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వినోద్ కుమార్ తనిఖీ చేశారు. సజావుగా నీట్ పరీక్షలు నిర్వహించిన అధికారులను కలెక్టర్ అభినందించారు.

కాలువ వెడల్పు పనులు వేగవంతం



హంద్రీ–నీవా కాలువ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఉరవకొండ: హంద్రీ–నీవా కాలువ వెడల్పు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం వజ్రకరూరు మండలం రాగులపాడు పంప్ హౌస్ వద్ద నుంచి ఉరవకొండ మండలం కౌకుంట్ల, వై.రాంపురం మధ్యలో 211.8 కిలోమీటర్ వద్ద, బెళుగుప్ప మండలం జీడిపల్లి డ్యాం వద్ద ప్రధాన కాలువ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీ–నీవా ప్రధాన కాలువ వెడల్పు పనులు నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్, ఆర్‌డీఓ వసంతబాబు, ఎస్ఆర్పీఎస్ శ్రీనివాస్, ఈఈలు శ్రీనివాసనాయక్, శ్రీనివాసులు, తహసీల్దార్ మహబూబ్‌బాషా, డీటీ నరేష్, డీఈఈ, జేఈలు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత దుర్మరణం



మున్నీ మృతదేహం

చెన్నేకొత్తపల్లి: కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ వివాహిత దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం సజ్జలకాలువకు చెందిన వివాహిత మున్నీ(30), తన దూరపు బంధువు హుస్సేన్‌బాషాతో కలసి పెనుకొండలోని దర్గాకు వచ్చారు. దర్శనం అనంతరం ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు చెన్నేకొత్తపల్లి మండలం యర్రంపల్లి – దామాజిపల్లి గ్రామాల మధ్య 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా వేగంగా దూసుకొచ్చిన కారు వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో మున్నీ అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన హుస్సేన్‌బాషాను స్థానికులు చెన్నేకొత్తపల్లిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, మున్నీకు భర్త ఇజాజ్, ఓ కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటకలో బీకేఎస్ వాసుల మృతి



మృతుడు రామకృష్ణ



హిమేష్ (ఫైల్)

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వర నగర్‌కు చెందిన మామ, అల్లుడు కర్ణాటకలో చోటు చేసుకున్న ప్రమాదంలో మృతిచెందారు. వివరాలు... విరూపాక్షేశ్వర నగర్‌కు చెందిన రామకృష్ణ (30) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కర్ణాటకలోని దావణగెరె జిల్లా హదాడి గ్రామంలో బంధువుల ఇంట పెళ్లికి ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన అల్లుడు హిమేష్ (19)తో కలసి రామకృష్ణ వెళ్లారు. ఆదివారం మామ, అల్లుడు సరదాగా హదాడి గ్రామ శివారులోని గుబ్బి కెనాల్ వద్ద ఈతకు వెళ్లి, ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. సమాచారం అందుకున్న రామకృష్ణ కుటుంబసభ్యులు హదాడి గ్రామానికి తరలివెళ్లారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

బుక్కరాయసముద్రం: మండలంలోని అమ్మవారిపేట గ్రామంలో కుక్కల దాడిలో 85 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు సిద్దప్ప, రామలింగ ఆదివారం అదే గ్రామ శివారులో కంచె ఏర్పాటు చేసి గొర్రె పిల్లలను అందులో ఉంచి పెద్ద గొర్రెలను మేపునకు తీసుకెళ్లారు. ఆ సమయంలో కుక్కలు చొరబడి 85 గొర్రె పిల్లలను కొరికి చంపేశాయి. దీంతో రూ.6 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

డిమాండ్లు నెరవేర్చమంటే బెదిరింపులా?

- న్యాయపరమైన డిమాండ్ల సాధనలో భాగంగా నిరవధిక సమ్మెలో ఎంఎల్‌హెచ్‌పీలు
- ఈ నెల వేతనంతో పాటు 9 నెలల ఇన్సెంటివ్‌ను ఆపిన ప్రభుత్వం
- కూటమి సర్కార్ తీరుపై అసహనం



అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

జిల్లాలో ఆయుష్మాన్ మందిర్‌లు	433
పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీల సంఖ్య	433మంది
రోజూ ఓపీ సేవలు తీసుకునే వారి సంఖ్య	1,000-1,200

అనంతపురం మెడికల్: గ్రామీణ పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీ)/ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సీహెచ్‌ఓ)ను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. వారి న్యాయపరమైన డిమాండ్లను ఏమాత్రం పట్టించుకోకపోవడమే కాకుండా వేతనాలు నిలుపుదల చేయడంతో పాటు 9 నెలల ఇన్సెంటివ్స్ బకాయిలనూ ఆపేసి పరోక్షంగా బెదిరింపు చర్యలకు దిగింది. ప్రభుత్వ తీరుపై పలువురు ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వివిధ రకాల సేవలు బంద్..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇంటి వద్దకే సేవలందించేందుకు ప్రతి సచివాలయ పరిధిలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ప్రతి క్లినిక్‌లో ఎంఎల్‌హెచ్‌పీలు అన్ని రకాల సేవలు అందించేవారు. ప్రజలకు వ్యయప్రయాసలు లేకుండా ఇంటి వద్దకే వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంది. గర్భిణులకు నెలనెలా చెకప్‌లు, చెవి, ముక్కు గొంతు సమస్యలను గుర్తించి మందులు ఇవ్వడం అవసరమైతే హయ్యర్ సెంటర్‌కు రెఫర్ చేయడం, బాలింతలకు సేవలు, వయసు పైబడిన వారికి ఇంటి వద్దకే వెళ్లి సేవలందించడం, హెచ్‌బీ, ప్రెగ్నెన్సీ, యూరిన్, బీపీ, మలేరియా, హెచ్‌ఐవీ, డెంగీ,విజువల్ ఇన్‌ఫెక్షన్(గర్భ సంచి ముఖ ద్వారా కేన్సర్‌పరీక్ష), అయోడిన్ పరీక్ష, హెపటైటిస్ బీ, స్పుటమ్, సుఖ వ్యాధులు, తదితర 14 రకాల పరీక్షలు చేసేవారు. వైద్య నిపుణుల ద్వారా టెలీ మెడిసిన్ సేవలు అందించేవారు. దీర్ఘకాలిక వ్యాధులైన థైరాయిడ్, ఫిట్స్ గుండె, కిడ్నీ వ్యాధులకు మందులు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటిని ఆయుష్మాన్ మందిర్‌లుగా మార్చడమే కాకుండా సేవలను గ్రామీణులకు దూరం చేస్తూ వచ్చింది.

మార్గదర్శకాలను అమలు చేయమంటున్నాం



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆరేళ్లు పని చేసిన వారికి రెగ్యులరైజేషన్ చేయాలి. కానీ ఈ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకూ ఎలాంటి స్పందన లేదు. ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నా నిర్లక్ష్యం చేస్తోంది. డిమాండ్లు తీర్చే వరకూ సమ్మెను కొనసాగిస్తాం.

– గౌరి, ఏపీ ఎంఎల్‌హెచ్‌పీ అసోసియేషన్ ప్రతినిధి

జీతం ఆపేస్తే ఎలా?



ఈ నెల అందాల్సిన జీతం ప్రభుత్వం ఆపేసింది. 9 నెలల ఇన్సెంటివ్స్‌నూ ఇవ్వలేదు. కానీ, ఏనాడు సకాలంలో ఇవ్వాలని అడగలేదు. ఇప్పుడు సమ్మెలోకి వెళ్లామని మాపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. ఇది సరైంది కాదు, ప్రజారోగ్యం కోసం శ్రమించే మాలాంటి వారిని నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ప్రభుత్వం తక్షణం స్పందించి డిమాండ్లను నెరవేర్చాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

– దివ్య,ఏపీ ఎంఎల్‌హెచ్‌పీ అసోసియేషన్ ప్రతినిధి

బాత్‌రూమ్‌కూ వెళ్లకూడదట



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట కొన్ని రోజులుగా ధర్నా చేస్తున్నాం. చంటి బిడ్డలను తీసుకుని మాతోటి ఉద్యోగులు వస్తున్నారు. అత్యవసరమై డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని బాత్‌రూంలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తే అడ్డుకుంటున్నారు. నీళ్లు లేవని, ఇక్కడికి రాకూడదని నిర్దయగా వ్యవహరిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారు. న్యాయపరమైన డిమాండ్ల కోసం పోరాడుతుంటే.. సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు.

– అనూష, ఎంఎల్‌హెచ్‌పీ

పచ్చ మీడియా కుట్రలను తిప్పికొడదాం

- బ్రిస్బేన్‌లో వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అవాస్తవాలను ప్రచారం చేస్తూ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తూ ప్రజలను వంచనకు గురి చేస్తున్న పచ్చ మీడియా కుట్రలను తిప్పికొడదామంటూ ప్రవాసాంధ్రులకు వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జరిగిన వైఎస్సార్‌సీపీ గ్లోబల్ కనెక్ట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆకాంక్షలతో కూడిన చర్చ జరిగింది. ప్రవాసాంధ్రులు భావోద్వేగంతో వైఎస్సార్‌సీపీ పట్ల తమకున్న అభిమానాన్ని చాటారు. ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్ సాగించిన 3,648 కిలోమీటర్ల పాదయాత్రలో ప్రజల బాధలు, వారి అవసరాలను తెలుసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయగానే అన్నింటినీ నెరవేర్చారని గుర్తు చేశారు. మేనిఫెస్టోను ఓ కాగితంగా కాకుండా ప్రజా ఒప్పందంగా నిరూపించారన్నారు. రూ.4.47 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ అయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఆర్థికాభివృద్ధిలో భాగంగా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులను, 90కి పైగా మౌలిక ప్రాజెక్ట్‌లను తీసుకువచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల్లోనే రాష్ట్రంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ సంక్షేమ పథకాలకు తిలోదకాలు ఇచ్చేసిందన్నారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలు, అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లోకి వ్యతిరేకత మొదలైందన్నారు. ఇలాంటి తరుణంలో ప్రజలకు అండగా నిలబడేందుకు అందరూ సామాజిక మాధ్యమాల ద్వారా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జగనన్న చేసిన మేలును గణాంకాలతోనే తెలియజేస్తూ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను చైతన్యపరిచేందుకు అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, క్వీన్స్‌ల్యాండ్ కన్వీనర్ బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

- సీపీఎం నాయకులు రాంభూపాల్, నల్లప్ప



విలేకరులతో మాట్లాడుతున్న రాంభూపాల్, నల్లప్ప

అనంతపురం అర్బన్: హైకోర్టు ఆదేశాలను చట్ట ప్రకారం అమలు చేయాలని పోలీసు అధికారులకు డిబెట్‌లో సూచించిన మాటలపై ఆక్రోశంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి సీపీఎంను లక్ష్యంగా చేసుకుని మాట్లాడడం సరి కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి నల్లప్ప అన్నారు. జేసీ ప్రభాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైకోర్టు ఆదేశాలను పోలీసులు అమలు చేయాలని మాత్రమే డిబెట్‌లో చెప్పామన్నారు. గతంలో అప్రజాస్వామ్యంగా జేసీ ప్రభాకరరెడ్డిని అరెస్టు చేసినప్పుడు, జేసీ ఇంటికి పెద్దారెడ్డి వెళ్లినప్పుడు కూడా టీడీపీ కంటే ముందు ఖండించింది తామేనని గుర్తు చేశారు. మున్సిపల్, అంగన్‌వాడీ కార్మికుల సమస్యలపై, ఆర్జాస్ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో చనిపోయిన ఆరుగురు కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ గతంలో సీపీఎం చేపట్టిన పోరాటానికి జేసీ ప్రభాకరరెడ్డి కూడా మద్దతు తెలియజేశారన్నారు. మరి ఆ రోజున తాము ఆయనతో మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యామా? అని ప్రశ్నించారు. ఏ రోజూ ఎవరితోనూ లాలూచీ పడాల్సిన అవసరం తమకు లేదన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా... ప్రజాసమస్యల పరిష్కారానికి శాంతియుతంగానే పోరాటాలు సాగిస్తున్నామన్నారు. ఈ ఏడాది జనవరి 1న తాడిపత్రిలో జేసీ ప్రభాకరరెడ్డి నిర్వహించిన మహిళా ఈవెంట్ కార్యక్రమంపై, బస్సు తగలబెట్టడంపై, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చేసిన దాడిపై మొదటిగా ఖండించింది సీపీఎం అని అన్నారు. నిజానిజాలను బట్టి ప్రజల పక్షాన సీపీఎం నిలుస్తోందన్నారు. చేసిన ఆరోపణలు నిరాధారమని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభాకర్‌రెడ్డి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాతోనే ఏపీ అభివృద్ధి

- విలేకరుల సమావేశంలో సీపీఐ నేత జగదీష్



విలేకరులతో మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు: ప్రత్యేక హోదాతోనే ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల సమయంలోనూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామని పార్లమెంట్ సాక్షిగా స్వయంగా ప్రధాన మంత్రి మోదీ ప్రకటించారని గుర్తు చేశారు. నేటికీ ఈ హామీకి దిక్కు లేకుండా పోయిందన్నారు. అమరావతి శంకుస్థాపనకు ఇటీవల వచ్చిన మోదీ... రాష్ట్ర రాజధాని అభివృద్ధికి రూ.45వేల కోట్ల నిధులను కేటాయించినట్లు గొప్పగా ప్రకటించారన్నారు. అయితే ఇందులో కేవలం 10శాతం మాత్రమే కేంద్రం భరిస్తోందని, మిగిలిన 90 శాతాన్ని రాష్ట్రానికి అప్పుగా ఇస్తోందని గుర్తు చేశారు. అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ కేవలం అప్పులతోనే రాష్ట్రాన్ని కూటమి సర్కార్ నెట్టుకొస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏపీ అభివృద్ధి వైపు పరుగులు పెట్టాలంటే ఒక్క ప్రత్యేక హోదాతోనే సాధ్యమన్నారు. ఈ అంశంపై కూటమి పెద్దలు పోరాటాలకు సిద్ధమైతే పార్టీలకు అతీతంగా అందరూ కలసి వస్తారన్నారు. కులగణనను కేవలం బిహార్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, ఎస్‌ఎండీ గౌస్, రాముడాయల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వివాదాల్లేకుండా టీచర్ల బదిలీలు చేపట్టాలి


- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు



ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎలాంటి కోర్టు వివాదాలు లేకుండా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు కోరారు. ఆదివారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన నగరంలో పీఆర్టీయూ నాయకులతో సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు వీలైనంత త్వరగా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థుల మధ్య నిష్పత్తిని తగ్గించాలన్నారు. వేసవి సెలవుల్లో సమ్మర్ కోచింగ్ నిర్వహించే ఉపాధ్యాయులకు ఈఎల్ సదుపాయం కల్పించాలన్నారు. డీఈఓ పూల్‌లో ఉన్న పండిట్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఉర్దూ పాఠశాలలో తెలుగు పోస్ట్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఆర్టీయూ అనంతపురం జిల్లా అధ్యక్షుడు టి. పురుషోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. తిమ్మారెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకులు ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి టి. చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఏ. కేశవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వైసీ ప్రసాదరెడ్డి, బి. చితంబరరెడ్డి, ఎంపీ శివారెడ్డి, బాబయ్య, శ్రీరాములు, చంద్రశేఖర్, జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం



ఈశ్వరమ్మ (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని రంగచేడు గ్రామానికి చెందిన చిరంజీవి భార్య ఈశ్వరమ్మ (28) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... రంగచేడుకు చెందిన ఆంజనేయులు, గంగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులతో పాటు కుమార్తె ఈశ్వరమ్మ ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగించేవారు. పదేళ్ల క్రితం రాయదుర్గం మండలం కెంచానపల్లి గ్రామానికి చెందిన చిరంజీవికి ఈశ్వరమ్మను ఇచ్చి వివాహం చేశారు. చిరంజీవి జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో పెళ్లి తర్వాత చిరంజీవి ఇల్లరికం వచ్చాడు. వీరికి ఓ కుమార్తె ఉంది. గత రెండేళ్లుగా ఈశ్వరమ్మ తరచూ కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించిన నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఖజానా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికల అధికారులు, పరిశీలకులతో ఖజానా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు


అనంతపురం అర్బన్: ఉమ్మడి జిల్లా ఖజానా ఉద్యోగుల సంఘం (ఏపీటీఏస్‌ఏ) కార్యవర్గం ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిసాయి. స్థానిక ట్రెజరీ హోమ్‌లో నిర్వహించిన ఈ ప్రక్రియకు ఎన్నికల అధికారులుగా ఆ సంఘం రాష్ట్ర నాయకులు పి.కిరణ్‌కుమార్ (నెల్లూరు), డి.రవికుమార్(కర్నూలు), ఎన్నికల పరిశీలకులుగా ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు ఎ.రవికుమార్ వ్యవహరించారు. కార్యవర్గంలోని అన్ని స్థానాలకు సింగిల్ నామినేషన్లు దాఖలు కావడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎన్నికైన సభ్యులకు ప్రొసీడింగ్స్ అందజేశారు.

నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

ఉమ్మడి జిల్లా ఖజానా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి.శంకర నారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.ఫారూక్ మహమ్మద్, కార్యదర్శిగా జి.మహేశ్వరెడ్డి, కోశాధికారిగా బి.అనంతయ్య ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా పి.సుమనలత, జి.జగదీష్, ఎం.శ్రీనివాసరావు, కె.వాసుమూర్తియాదవ్, సంయుక్త కార్యదర్శులుగా పి.సిద్ధిక్‌ఖానుమ్, డి.శ్రీనివాసులు, ఎం.కె.రాజేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సి.తిరుమలరెడ్డి, సి.కిషోర్‌కుమార్‌చౌదరి, జి.ఉమేష్ ఎన్నికయ్యారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

- రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు శంకరయ్య



వివరాలు వెల్లడిస్తున్న బలిజ మహాసంఘం నాయకులు

అనంతపురం టవర్ క్లాక్: ఉమ్మడి జిల్లాలో బలిజ సామాజిక వర్గానికి చెంది, పదో తరగతిలో 550 మార్కులకు పైగా సాధించిన విద్యార్థుల నుంచి ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు శంకరయ్య తెలిపారు. అనంతపురంలోని శ్రీనివాస కల్యాణ మంటపంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగదు పురస్కారాలతో పాటు జ్ఞాపకలను అందజేసి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు తమ దరఖాస్తులను నేరుగా, లేదా పోస్టు ద్వారానైనా అనంతపురంలోని శ్రీనివాస కల్యాణమంటపంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 98664 19693, 94901 80177, 92477 92567లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంఘం మాజీ అధ్యక్షుడు పాముదాయి వెంకటేశ్వర్లు, వెంకట్రాముడు, విజయభాస్కర్, సాయిప్రసాద్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

11న కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం టవర్‌క్లాక్: పదో తరగతిలో ప్రతిభ కనపరిచిన కురుబ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఈ నెల 11న ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందించనున్నారు. ఈ మేరకు కనకదాస విద్య, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లిస్వామి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 11న అనంతపురంలోని కనకదాస కల్యాణ మంటపంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ముఖ్య అతిథులుగా మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి హాజరవుతారని పేర్కొన్నారు.

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ



బెడ్‌రూమ్‌లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

గుంతకల్లు: స్థానిక సిద్దార్థ నగర్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి ఇంట్లో దుండగులు చొరబడి విలువైన సామగ్రిని అపహరించారు. వివరాలు.. పట్టణ శివారులోని సివిల్ న్యాయస్థానం వెనుక సిద్దార్థ నగర్‌లో రైల్వే బుకింగ్ ఆఫీస్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్న శరత్ నివాసముంటున్నారు. కుటుంబసభ్యులందరూ హైదరాబాద్‌కు వెళ్లడంతో ఒంటరిగా ఉన్న శరత్ శనివారం ఇంటికి తాళం వేసి నైట్ డ్యూటీకి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత శరత్ ఇంటి తాళాన్ని చిన్నపాటి కడ్డీతో తొలగించి లోపలకు ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లో బీరువాకే తాళాలు ఉండడం గమనించి అందులోని 12 తులాల బంగారు నగలు అపహరించారు. అనంతరం ఆ పక్కనే నివాసముంటున్న మున్సిపల్ విశ్రాంత అధికారి ఓ.రామాంజనేయులు (తన బంధువుల ఇంట శుభకార్యం ఉండడంతో ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి బెంగళూరుకు వెళ్లారు) ఇంటికి వేసిన తాళం గుర్తించి లోపలకు చొరబడ్డారు. బీరువాలోని నాలుగు తులాల బంగారు నగలతో పాటు కొంత నగదు అపహరించినట్లు సమాచారం. రామాంజనేయులు బెంగళూరులో ఉండటంతో ఎంత మొత్తం చోరీ అయింది తెలియరాలేదు. ఆయన వచ్చి ఫిర్యాదు చేసిన తర్వాత కేసు నమోదు చేస్తామని గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అలాగే రైల్వే ఉద్యోగి శరత్ ఇంటినీ పరిశీలించి, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డ్రిప్ టార్గెట్ 18 వేల హెక్టార్లు

- ఇంకా ఏపీఎంఐపీకి అందని గ్రీన్‌సిగ్నల్

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది జిల్లాకు డ్రిప్, స్ప్రింక్లర్ల టార్గెట్ 18 వేల హెక్టార్లు ఇచ్చినట్లు ఏపీఎంఐపీ వర్గాలు తెలిపాయి. అయితే నియమ నిబంధనలు ప్రకటించలేదన్నారు. ఈ ఏడాది 5 ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ వర్గాల రైతులకు 100 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నట్లు సమాచారం. అలాగే 10 ఎకరాల్లోపు ఉన్న ఇతర రైతులకు 90 శాతం రాయితీని వర్తింపజేయనున్నట్లు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు ఏపీఎంఐపీకి అందకపోవడంతో ఎలాంటి ప్రకటన జారీ చేయకుడా మిన్నకుండిపోతున్నారు. ప్రస్తుతం గతేడాది అర్హులైన రైతుల్లో ఇంకా చాలా మందికి మెటీరియల్ సరఫరా చేస్తూ ఉన్నారు. అడిగిన ప్రతి రైతుకూ సూక్ష్మ సేద్యం పరికరాలు ఇవ్వాలనే ఆలోచనతో ఆర్భాటంగా మొదట జిల్లాకు 42,100 హెక్టార్లు టార్గెట్ ఇచ్చిన కూటమి సర్కారు... రాను రాను తగ్గిస్తూ చివరకు 18 వేల హెక్టార్లకు కుదించింది. ఇందులో 12,635 మంది రైతులకు 15,060 హెక్టార్లకు డ్రిప్ పరికరాలు అందించగా... 2,234 మంది రైతులకు 2,582 హెక్టార్లకు స్ప్రింక్లర్ సెట్లు అందించారు. ఇలా మొత్తంగా 14,869 మంది రైతులకు 17,642 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేశారు. ఇంకా మెటీరియల్ సరఫరా, ఇన్‌స్టాలేషన్ పూర్తి కాలేదు. ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 35 రోజులు కావస్తున్నా... ఇంకా టార్గెట్ల వద్దనే ఆగిపోయారు. ఇప్పటికే 30 వేల మంది వరకు రైతులు పరికరాల కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారు.


గొర్రెల వ్యాపారిని బెదిరించి రూ. 6.80 లక్షల అపహరణ



బాధితుడు నారాయణస్వామి

బుక్కరాయసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి పరిధిలో గొర్రెల వ్యాపారిని దుండగులు అటకాయించి నగదు దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు.. బీకేఎస్‌కు చెందిన నారాయణస్వామి గొర్రెల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. శనివారం అనంతపురం మార్కెట్ యార్డులో గొర్రెలు విక్రయించగా వచ్చిన డబ్బుతో అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో గొర్రెలు కొనుగోలు చేసేందుకు తన స్కూటీ వాహనంపై బయలుదేరాడు. దేవరకొండ – ఉప్పరపల్లి మధ్యలో ద్విచక్ర వాహనాలపై వచ్చిన నలుగురు వ్యక్తులు ముఖానికి మాస్క్ వేసుకుని నారాయణస్వామిని అడ్డుకున్నారు. డబ్బు ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరించి, అతని వద్ద ఉన్న రూ.6.80 లక్షలు లాక్కొని ఉడాయించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గార్లదిన్నె: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గార్లదిన్నె పీఎస్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన రాజశేఖర్, శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన సుధీర్‌రెడ్డి, భాస్కరరెడ్డి జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు క్రికెట్ బెట్టింగ్‌ల వైపు మొగ్గు చూపారు. ఈ క్రమంలో ఆదివారం పలువురిని ఆకట్టుకుని ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తుండగా పక్కా సమాచారంతో శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐలు గౌస్ మహమ్మద్ బాషా (గార్లదిన్నె), విజయ్‌కుమార్ (శింగనమల) కల్లూరులోని రాజశేఖర్ ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రాజశేఖర్‌తో పాటు సుధీర్‌రెడ్డి, భాస్కరరెడ్డి పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.4,02,000 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

క్లుప్తంగా

రిటైర్డ్ డీడీఏ మృతి



రామచెన్నారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) రామచెన్నారెడ్డి (90) మృతికి ఆ శాఖ విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు నివాళులర్పించారు. ఆదివారం రామచెన్నారెడ్డి నివాసంలో ఆయన మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించారు. వ్యవసాయశాఖలో వివిధ హోదాల్లో రైతులకు సేవలందించారని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, నాయకులు ఎ.మల్లికార్జున, టి.సుబ్బారెడ్డి, చన్నరాయుడు, చెన్నారెడ్డి, రవీంద్రారెడ్డి, విజయుడు, విశ్వనాథ్, గురుమూర్తి తదితరులు నివాళులర్పించారు.

పుస్తక పఠనంతో మేధో వికాసం



కథల పుస్తకం చదివిస్తున్న గ్రంథాలయాధికారి వీరనారాయణ రెడ్డి

రాప్తాడు: విద్యార్థులకు పుస్తక పఠనం ద్వారా లభించే జ్ఞానం జీవితాంతం వారి వెంటే ఉండి వారి భావి జీవితాన్ని తేజోవంతం చేస్తుందని గ్రంథాలయాధికారి వీరనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం, వేమన పద్యాలు కంఠస్థం చేయించారు. అలాగే భగవద్గీత శ్లోకాలు చెప్పించారు. ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ.. గ్రంథాలయాలంలోని పుస్తకాలు చదవడం, కథలు వినడం ద్వారా విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవచ్చని సూచించారు. విద్యార్థులు పుస్తకంపై బాల్యదశ నుంచే మక్కువ పెంచుకోవాలన్నారు. పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడం, వారిలోని సృజానాత్మకతను పెంపోందించేలా వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, ఆదినారాయణ, బుల్లే నాగన్న తదితరులు పాల్గొన్నారు.

గణపతి సచ్చిదానంద స్వామీజీ సేవలు స్ఫూర్తిదాయకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, తదితరులు

రాప్తాడు: అనంతను ఆధ్యాత్మికంగా ప్రపంచ స్థాయిలో నిలిపిన మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆధ్యాత్మిక ప్రబోధనలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కొనియాడారు. ఐదు రోజులుగా రాప్తాడు మండలం బొమ్మేపర్తిలోని గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమంలో జయలక్ష్మి మాత జయంతి ఉత్సవాలు, లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థులు చేతుల మీదుగా విశేష పూజలు, హోమాలు పెద్ద ఎత్తున జరిగాయి. చివరి రోజు ఆశ్రమంలో మంత్రి చేతుల పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా నరహరితీర్థ వేదవిద్యా నిలయం, జయలక్ష్మీ మాత వైద్యశాల, అన్నపూర్ణ మందిరం, జయలక్ష్మీ మాత ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాప్తాడు, అనంతపురం ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వెంకటనాయుడు, సుజాత, బోయ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకోవడం అందరి బాధ్యత

అనంతపురం కల్చరల్: పేదరిక నిర్మూలనకు పాటుపడుతున్న ఆర్డీటీని కాపాడుకోవడం అందరి బాధ్యతగా భావించి పోరాడాలని అఖిల పక్ష కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఫెర్రర్ విగ్రహం ముందు నివాళులర్పిస్తూ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి వస్తున్న నిధులను ఆపేయడం అన్యాయమని తెలిపారు. దీనిని నిరసిస్తూ కలెక్టర్ ఆఫీసు ఎదురుగా ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం ముందు ఈనెల 5 నుంచి 12వ తేదీ వరకూ (వారం రోజులు) రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వామపక్ష, కుల, ప్రజాసంఘాలతో పాటూ అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావంగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ నాయకులు సాకే హరి, కేపీ రాజు, శ్రీనివాసులు, శంకరరెడ్డి, సాకే సుధాకర్, శివానంద, రామకృష్ణ, నారాయణస్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చూసొద్దాం రండి



పంపనూరు సిటీ పార్కు ముఖద్వారం



ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. పిల్లలు ఇంట్లో సెల్‌ఫోన్, టీవీ చూస్తూ కాలక్షేపం చేస్తుంటారు. సెలవుల్లో పిల్లలకు విజ్ఞానం, ఆహ్లాదం అందించేందుకు పర్యాటక ప్రదేశాలకు తీసుకెళ్తే మంచిది. చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలను నేరుగా సందర్శిస్తే విజ్ఞానం కూడా పెరుగుతుంది.

- పచ్చదనంతో కళకళలాడుతున్న పంపనూరు సిటీ పార్క్
- కుటుంబ సమేతంగా చూడాల్సిన ప్రదేశం

ఆత్మకూరు: పంపనూరు పర్యాటక ప్రదేశంగా ప్రఖ్యాతి గాంచింది. అనంతపురం జిల్లా కేంద్రానికి దగ్గరగా కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో తప్పక సందర్శించాల్సిన ప్రదేశం. అనంతపురం నుంచి ప్రత్యేక బస్సులు, వందల సంఖ్యలో ఆటోలు పంపనూరుకు వెళ్తుంటాయి. ప్రస్తుత వేసవి సెలవుల్లో తక్కువ ఖర్చుతో చూసి ఆనందించే మంచి ప్రదేశం పంపనూరు పుణ్యక్షేత్రం అని చెప్పవచ్చు. జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన ఆలయాల్లో పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఒకటి. ఈ ఆలయానికి ప్రతి ఆది, మంగళవారాల్లో స్వామి దర్శనానికి వేల సంఖ్యలో భక్తులు వస్తారు. పంపనూరు కొండపై మల హోబిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఉంది. ఈ కొండపై శతాబ్దాల కాలం నాటి రాళ్ల పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

సిటీ పార్కులో సందడి

వేసవి సెలవులు కావడంతో చాలా మంది కుటుంబ సమేతంగా పంపనూరు సిటీ పార్కుకు వస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంపనూరు కొండ ప్రాంతాలతో పాటు పార్కు పచ్చదనంతో కళకళలాడుతోంది. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటంతో పిల్లలు ఆటలు ఆడుతూ సేదతీరుతున్నారు. వివాహాలు అయిన వారు ఫొటోషూట్‌లు కూడా పార్కులోనే తీసుకుంటున్నారు. పార్కులో పిల్లలు ఆడుకోవడానికి ఆట బొమ్మలు, ఆట పరికరాలు, జంతువుల బొమ్మలు కూడా ఉన్నాయి. చాలా మంది పార్కులోని జింకలకు ఆహారం అందిస్తున్నారు. చిన్నారులతో కుటుంబ సమేతంగా వచ్చి ఆనందంగా గడుపుతున్నారు.



పార్కులో సంచరిస్తున్న జింక



ఆటల్లో నిమగ్నమైన చిన్నారులు



ఆకట్టుకుంటున్న జిరాఫీ బొమ్మ

ప్రభుత్వ వైఫల్యాలను తిప్పికొడదాం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ విభాగం నగర ఉపాధ్యక్షుడు అసిఫ్, యువజన విభాగం నగర ఉపాధ్యక్షుడు తలారి వినీత్

అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వం 11 నెలల కాలంలో దౌర్జన్యాలు, అక్రమాలకు తెరలేపింది. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోంది. ఎక్కడ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తారని పోలీసుల ద్వారా బెదిరింపు చర్యలకు పాల్పడుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను తిప్పికొట్టేందుకు ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలి' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నగర ఉపాధ్యక్షుడు అసిఫ్, యువజన విభాగం నగర ఉపాధ్యక్షుడు తలారి వినీత్ వేర్వేరుగా నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. పార్టీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని కలసి గజమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్‌లో ఒక్క హామీను అమలు చేయలేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు మోసపూరితమైన హామీలతో గద్దెనెక్కారన్నారు. బాబు కపట నాటకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ప్రత్యక్షంగా పోరాటానికి సిద్ధం కావాలని తెలిపారు. పార్టీ బలోపేతానికి పని చేసే వారికి ఎప్పటికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికులకు అన్యాయం



కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: కార్మికుల హక్కులు దెబ్బ తీసే లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను కొనసాగించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదీన తలపెట్టిన కార్మిక సంఘాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలనిపిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా సదస్సు కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శులు రాజారెడ్డి, నాగేంద్ర కుమార్, చంద్రశేఖర్, వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధనాలపై ఈనెల 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె తలపెట్టాయన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. కేంద్రంలో 8వ, రాష్ట్ర 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేసేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, సీఐటీయూ నగర కార్యదర్శి ముత్తూజ, వైఎస్సార్‌టీయూ నగర అధ్యక్షుడు ఖాజా, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లింగమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఆటో యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు దుర్గాప్రసాద్, కృష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: ముస్లిం మైనార్టీ నాయకుల అనేక సమస్యలకు మోదీతో కలిసి ఆడుతున్న చంద్రబాబు కపట నాటకం ప్రధాన కారణమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం అహ్మద్, మేయర్ వసీం విమర్శించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసనల కోసం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ఆదివారం స్థానిక సాయినగర్‌లోని శ్రీనేత్ర మందిరంలో యునైటెడ్ జేఏసీ నాయకుల సమావేశం జరిగింది. అన్ని రాజకీయ పార్టీల్లో లౌకికవాదులతో పాటూ పలు కుల, ప్రజా సంఘాల నాయకులు వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం చేపట్టాల్సిన మానవహారానికి ముందుగా అనుమతి తీసుకున్నా తీరా ట్రాఫిక్ అంతరాయమంటూ అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. గతంలో ఎన్‌ఆర్‌సీ నిరసన ఉద్యమాల సమయంలో లేని ఇబ్బంది ఇప్పుడు ఎలా వస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేసే వరకూ నిరసనలు ఆగవని హెచ్చరించారు. అలాగే పెహల్గాం సంఘటనను యునైటెడ్ జేఏసీ తీవ్రంగా ఖండించింది. అనేక సందర్భాల్లో కచ్చితంగా కేంద్ర ప్రభుత్వ భద్రత వైఫల్యాన్ని మతాలకు వాడుకోవడం విచారకరమన్నారు. అందరూ ఈ విషయంలో నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, దాదాగాంధీ, గోల్డ్ బాషా, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి



మాట్లాడుతున్న కుళ్లాయి స్వామి

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. అడ్మిషన్లతో పాటు విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను వేల రూపాయలకు అమ్ముతూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదన్నారు. ఇంటర్ విద్యార్థులకు సెలవు దినాల్లోనూ మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న వారికి ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నా.. బోర్డు అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. అలాంటి కళాశాలలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు మంజునాథ్, కోశాధికారి నాని, సహాయ కార్యదర్శి సమీర్, నాయకులు ప్రవీణ్, తరుణ్, తౌకిర్, మెహది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ఆటల పోటీలు

అనంతపురం కల్చరల్: కొత్తూరు అమ్మవారి శాలలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీమాత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ హుషారుగా ఆటపాటలతో సందడి చేశారు. జ్ఞాపకశక్తి పరీక్షలు, అంత్యాక్షరి, చెప్పుకోండి చూద్దాం వంటి ఆటల్లో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈనెల 7న వాసవీ మాత జయంతి రోజున వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. అంతకు ముందు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవతకు పూజలు చేపట్టారు.

ఒంటె విగ్రహ ప్రతిష్ట

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రంలో తొలిసారి హనుమంతుడి వాహనమైన 'ఒంటె' విగ్రహ ప్రతిష్టను వినూత్నంగా నిర్వహించారు. స్థానిక విద్యుత్ నగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం 'ఒంటె' విగ్రహాన్ని వేదపండితులు రఘోత్తమచారి బృందం ప్రతిష్ఠించారు. వేదమంత్రోచ్ఛాటనలు, మంగళ వాయిద్యాల నడుమ సుదర్శన హోమం చేశారు. మధ్యాహ్నం పూర్ణాహుతి అనంతరం వందలాది మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. ఈనెల 22న హనుమజ్జయంతి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ కార్యదర్శి వేణుగోపాల్, సాయిట్రస్టు విజయ్ సాయికుమార్ పాల్గొన్నారు.



గాలివానకు నేలవాలిన మొక్కజొన్న

కన్నీరు మిగిల్చిన మొక్కజొన్న

మూడు రోజుల క్రితం కురిసిన గాలీవానకు అనంతపురం రూరల్ మండలం కృష్ణమరెడ్డి పల్లి సమీపంలో 17, 20 సర్వే నంబర్లలో దాదాపు 15 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట దెబ్బతింది. పంట దిగుబడి ఆశాజనకంగా ఉండగా.. తీరా చేతికొచ్చే సమయంలో ఇలా జరిగిందంటూ రైతులు సుధీర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కొండారెడ్డి, పి.ప్రతాపరెడ్డి, ఎల్.ప్రతాపరెడ్డి, చియ్యేడు వెంకటరెడ్డి తెలిపారు. ఎకరాకు దాదాపు రూ.30 వేల దాకా పెట్టుబడి పెట్టారు. మరో 20 రోజుల్లో కోతలు ప్రారంభించాల్సి ఉండగా ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదని లబోదిబోమంటున్నారు.

– రాప్తాడు రూరల్:



రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ

ఆదమరిస్తే ప్రమాదమే..

రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్‌కి వెళ్లే సర్కిల్‌లో డ్రైనేజీకి ఎలాంటి రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. రోజూ వందలాది వాహనాలు ఈ రోడ్డు మార్గంలో వెళ్తుండటంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు భయపడుతున్నారు. ఇప్పటికే అక్కడ చాలామంది ప్రమాదాలకు గురై గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ప్రమాదం పొంచి ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. వినతిపత్రాలు ఇచ్చిన పట్టించుకోలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ కాలువకు రక్షణ గోడ నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

– అనంతపురం రూరల్:

అసంబద్ధ విధానాలు వీడాలి

- ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సూచన

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యావ్యవస్థలో అసంబద్ధ విధానాలు విడనాడాలని ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ సూచించారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సోమవారం పాత తాలూకా ఆఫీసుల వద్ద, 9న కలెక్టరేట్ వద్ద, 14న విజయవాడలో రాష్ట్ర స్థాయిలో చేపట్టే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 1 నుంచి 5 తరగతులతో మోడల్ ప్రాథమిక పాఠశాల, బేసిక్ ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగిస్తూ 6 నుంచి 10 లేదా 12 తరగతుల ఉన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7 తరగతులు ఉన్నచోట 4 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6, 7, 8 తరగతులు ఉన్నచోట 6 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కనీసం రెండు ఎస్జీటీ పోస్టులను కేటాయించాలన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కృష్ణ ప్రసాద్



సమావేశానికి హాజరైన ల్యాబ్ టెక్నీషియన్స్

అనంతపురం మెడికల్: ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కృష్ణప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం ఎన్‌జీఓ హోంలో ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే కార్యనిర్వహణ కార్యదర్శిగా మనోజ్‌కుమార్, కోశాధికారిగా నాగేంద్ర ఎన్నికయ్యారు.

అలరించిన ఆ పాత మధురాలు

అనంతపురం కల్చరల్: తెలుగు సినీ సంగీత లోకానికి గుర్తింపు తెచ్చిన జానకి జీవితం స్ఫూర్తిదాయకమని వక్తలు అన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అసోసియేషన్, ఘంటసాల సాంస్కృతిక సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గానకోకిల జానకి జన్మదిన వేడుకలు జరిగాయి. 'మౌన మేలనోయి ఈ మరుపురాని రేయి' పేరుతో స్థానిక హౌసింగ్ బోర్డులోని ఘంటసాల స్మారక మందిరంలో జరిగిన సంగీత విభావరిలో పలువురు గాయనీ గాయకులు జానకి పాడిన అలనాటి మధుర గీతాలతో హోరెత్తించారు. డీఆ ర్వో మలోలతో పాటూ సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, ఓబుళదాసు, మల్లి కార్జున, ఆచార్య సుధాకరబాబు, విజయలక్ష్మి, బృంద, శ్రీదేవి తదితరులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఘంటసాల ఆరాధన సమితి గౌరవాధ్యక్షుడు జీవీ రామయ్య, జ్ఞానశేఖర్, మనోజ్, రసూల్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాసరి నారాయణరావు జయంతి



మాట్లాడుతున్న ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

అనంతపురం కల్చరల్: తెలుగు సినీ పరిశ్రమకు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన దాసరి నారాయణరావు వంటి దర్శకులు మళ్లీ జన్మించబోరని ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కో–ఆర్డినేటర్ సాయి పవన్ అన్నారు. ఆదివారం దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి నిర్వహించారు. కళాకారులతో కలిసి స్థానిక కమలానగర్‌లోని నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలుగు పరిశ్రమ చిరకాలం వర్ధిల్లాలని పరిశ్రమ పెద్దగా వ్యవహరించిన తీరు పక్క రాష్ట్రాల వారికి స్ఫూర్తినిచ్చిందన్నారు. ఎంతో మంది నటీనటులు, నిర్మాతలు, దర్శకులకు అండగా నిలిచారని కొనియాడారు. కేవలం దర్శకుడిగానే కాకుండా నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా, పత్రికాధినేతగా దాసరి జీవితం ఎంతో మందికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సినీ, టీవీ, రంగస్థలానికి చెందిన భువనేశ్వరి ఫిల్మ్ స్టూడియోస్ నిర్మాత భువన, మహిళా నాయకురాలు రాములమ్మ, నరసింహులు, దేవా ప్రశాంత్, రామకృష్ణ, నాగమునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు అండగా ఉంటాం

అనంతపురం టవర్‌క్లాక్: మాదిగలకు ఎటువంటి కష్టం వచ్చిన అండగా ఉంటామని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ఎంఆఎఫ్ ఆధ్వర్యంలో మాదిగ ఎమ్మెల్యేలకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ వర్గీకరణ కోసం శ్రమించారన్నారు. మాదిగలకు కష్టం వస్తే మా దృష్టికి తీసుకరావాలని మీము అండాగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నాయకులు శ్రీనివాసులు, బిక్షులు, అమర్‌నాథ్, గంగాధర్, నరసింహులు, రమేష్, నాగేంద్ర, కదిరప్ప, సుబ్బరాయుడు, హరి గోపాల్, ఆంజనేయులు, ఎంఆఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పాల్గొన్నారు.